# మమకారం ముసుగులో...

- ఆకెళ్ళ శ్రీరామకృష్ణ

''ఎవండీ! ఒక్కసారి మన పిల్లల్ని చూడాలని వుందండీ.. రమ్మని కబురుచేయండి'' అడిగింది సుశీల తన భర్త రామారావును.

''పిచ్చిదానా! ఎవరే మన పిల్లలు? నీకు నేనూ, నాకు నువ్వూ అంతే..'' అన్నాడు రామారావు నిక్కచ్చిగా.

''అలాగనకండీ..చిన్నప్పట్నుంచి మీ అన్నగారి పిల్లలైనా నాదగ్గరే నాపిల్లల్లానే పెరిగారు...నాకు వాళ్ళంటే ఎంతప్రేమో..వాళ్లకూ నేనంటే అంత అభిమానం..మీకేం తెలుసు? పిన్నీ..పిన్నీ..అంటూ ఒక్క క్షణం వదిలేవారు కాదు...ఏం చేస్తున్నారో ఏమిటో..ఒక్కసారి కబురుచేయండి..'' ప్రాధేయపూర్వకంగా అడుగుతోంది .

''నేను చెప్పేది అర్థం చేసుకోసుశీలా! రెక్కలు వచ్చాక ఎవరికెవరో..ఎవరి జీవితాలు వాళ్ళవి, ఎవరి బతుకులు వాళ్ళవి...అయినా మనసుంటే మార్గాలు అనేకం. వాళ్ళు రావాలనుకుని రావాలేగానీ, మనం పిలిస్తే మాత్రం వస్తారా?'' అన్నాడు నిరాశగా.

ఆ మాటలు సుశీలకేం కొత్తకాదు. ఈ మనిషింతే ఆయనకెంత తోస్తే అంత. వాళ్ళుకూడా ఈయనకు తగ్గట్టుగానే చేస్తుంటారు. అంతా నా ఖర్మ అనుకుంటు మెల్లగా నిద్రలోకి జారుకుంది.

ఆమె అడిగినదానికేదో చెప్పేడే కానీ రామారావుకు మాత్రం తన అన్నగారి పిల్లలంటే ఎంత అభిమానం? అది తన అన్నగారిమీద మమకారం కావచ్చు, తనకు పిల్లలు లేని శాపం, వారిపాలిట వరం అవ్వచ్చు. ఏదైనా వాళ్ళకోసం తన జీవితం త్యాగం చేసాడు. మగపిల్లలు ముగ్గురిలో ఇద్దర్ని ఉద్యోగస్తులను చేశాడు. తన అన్న కూతురు గిరిజను తన కూతురులానే పెంచి పెద్దచేసి ఆమె వివాహం బాధ్యత తన నెత్తిమీదే వేసుకుని తన స్వంత ఖర్చులతో చేశాడు. ఇంత చేసినా తన భార్య ఆరోగ్య విషయానికి కొచ్చేసరికి ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఈ శరణాలయాన్ని ఆశ్రయించాడు. అక్కడలేని మనశ్శాంతి ఇప్పుడు ఇక్కడ లభిస్తోంది తనకు.

కారణం...అది వాతావరణ ప్రభావమా?

అదికూడా ఒకకారణం కావచ్చు. అందుకేకాబోలు నగరానికి సుమారు 30కిలోమీటర్ల దూరంలోవున్న భవానీపురంలో నిర్మించారీ శరణాలయాన్ని. ప్రశాంతమైన వాతావరణానికి పెట్టింది పేరు. శోభాయమానమైన ప్రకృతి రమణీయత మనసును మైమరపిస్తోంది. ఆ వాతావరణంలో పచ్చని చెట్లమధ్య విశాలమైన కుటీరాలలో స్త్రీ, పురుషులు తమ వయోభారాన్ని సయితం లెక్కచేయక ఉత్సాహంతో పనిచేస్తున్నారు.

పేరుకు శరణాలయం అయినప్పటికీ వాళ్ళందరికీ అక్కడ ప్రకృతి వైద్య సౌకర్యం కూడా వుంది. ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న స్వామీజీ వైద్యం చేస్తే ఎంత మొండి రోగ



మైనా తగ్గిపోతుందని ప్రతీతి. అలాగని అది ఆసుపత్రిగా, శరణాలయంలా వుండదు. ఒక పాఠశాలలా అనుపిస్తుంటుంది. ఇక్కడివాళ్ళందరూ తోటివారితో ఆప్యాయత, అనురాగం పంచుకుంటూ, గతం గురించి చితించక, వున్నకొద్దిపాటి కాలాన్ని హాయిగా గడపాలనే ఉత్సాహంతో పనిచేస్తున్నారు.

వీరికి తమతోటివారిని చూస్తుంటే చాలా ఆశ్చర్యమేస్తోంది. వారందరూ కూడా జీవితసంగ్రామంలో ఎదురు దెబ్బలెన్నో సహించి, పోరాడి, పోరాడి అలసిపోయి



విశ్రాంతి తీసుకుంటున్న యుద్ధవీరుల్లా ఉన్నారు. తాము మాత్రం వారిలా సంతోషంగా ఉండలేకపోతున్నారు..కారణం.. ఎక్కడో ఏదో మూల ఇంకా అయిన వాళ్ళ మీద మమకారంతో మనసు మథనపడుతోంది. తను చేసిన అపరాధం ఏమిటి? ఈ శరణాయలానికి రావాల్సిన అగత్యం ఏమిటని పునరాలోచన చేసుకుంటూ ....గతస్మృతులల్లోకి వెళ్లాడు రామారావు.

• • •

''రవీ..మొన్న వొచ్చిన పెళ్ళివారు మనమ్మాయి నచ్చిందని ఉత్తరం రాశారు. వాళ్ళు లక్షరూపాయలు దాకా అడుగుతున్నారు. అవికాకుండా లాంఛనాలు పెళ్ళి ఖర్చులు దాదాపు ఇంకో లక్ష పైనే అవుతాయి. మరి మీనాన్న దాచిన డబ్బులు బ్యాంకులో యాభై వేలే ఉన్నాయి. మిగతావి ఎలా అంటావు? ఏం చేద్దాం ఏమిటీ..నీ అభిప్రాయం చెప్పు?''

''మీరు ఎలా అంటే అలాగే..నేను మాత్రం పదివేలకు మించి ఇవ్వలేను...''

''మరి నువ్వేమంటావురా'' రెండోవాడైన సాయిని అడిగాడు.

''నేను ఐదు వేలుకన్నా ఇవ్వలేను..''

మూడోవాడివైపు ఆయన చూడకపోయినా రమణనే చెప్పాడు .

''నేనేమీ డబ్బులివ్వలేను''

''అది సరేరా మీ అన్నదమ్ములిద్దరూ ఇచ్చేవి మీ నాన్న బ్యాంకులో వేసినవీ కలిపితే అర్వై ఐదువేలే వచ్చాయి. మిగతా డబ్బులు ఎలాగో ఆలోచించండి. చిన్నవాడికైతే ఇంకా ఉద్యోగం లేదు. రేపుపొద్దున్నే మీ నిర్ణయాలు తెలియజేస్తే నేను ఎల్లుండి వెళ్ళి వాళ్ళతో మాట్లాడతాను.'' అంటూ సమావేశాన్ని తాత్కాలికంగా ముగించారు రామారావుగారు.

పడకుర్చీలో వెనక్కివాలి ఆలోచనలో పడ్డారు రామారావు. వాళ్ళు చెప్పిన అంకెలు ఆయన చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. మనస్సు చివుక్కుమంటోంది. తన అన్నయ్య కొడుకులకు ఎంతచేసిందీ, వాళ్ళగురించి తన జీవితాన్నెంత ధారపోసిందీ తనకు తెలుసు. తను కూడా చిన్నప్పట్నుంటీ అన్నగారి సంరక్షణలోనే పెరిగాడు. ఆ విశ్వాసంతోనే వాళ్ళ సంరక్షణ భారంతోపాటు అన్నకూతురి పెళ్ళి బాధ్యతను వహించాడు. కానీ వీళ్ళు చదువులకోసం, ఉద్యోగాలకోసం, ఇల్లుకట్టుకోవడం కోసం, వ్యాపారాలకోసం తన అన్నయ్యవద్దనుండి ఎంతెంత గుంజేసేవాళ్ళో. వాళ్ళు అడిగిందే తడవుగా అన్నయ్య ఇచ్చేసేవాడు. తన అన్నయ్యా, వదినా కాలం చేసి రెండేళ్ళవుతోంది....వాళ్ళు పోయారనే బాధలేదు సరికదా...ఇంకా వాళ్ళ నాన్న బతికుండి వాళ్ళకింత సంపాదించి ఇవ్వలేదనే వాళ్ళ బాధంతా. అంతే కానీ...జీవితాంతం తమగురించే కష్టపడిన తండ్రి చివరి బాధ్యత (కోరిక) తీరుద్దామనే ఉద్దేశ్యం ఒక్కరికీ లేదు. అలాంటివారికి ఆస్తులు పంచుకున్నంత సంబరంగా, బాధ్యతలు పంచుకోవడమంటే కష్టమే!

మరి తనకుమాత్రం ఎందుకు? తనకు పిల్లలు లేరు కాబట్టి తన అన్నగారితో పాటు తనుకూడా వాళ్ళకు ఒకింత సహాయం చేస్తూ వచ్చాడు. ఇప్పుడు తనూ రిటైరయ్యాడు. తననెవరు చూస్తారు? కన్న తండ్రి తమకేం చెసాడని? అడిగే వీళ్ళు తనను మాత్రం చూస్తారా?... అలాగని వదిలేస్తే గిరిజకు పెళ్ళవుతుందా? ఆడపిల్ల ఉసూరుమనదూ..మనసొప్పడం లేదు..ఎలా... ఆలోచిస్తున్న రామారావు, సుశీల పిలుపుతో ఈలోకంలోకొచ్చాడు.

''టీ స్కోండి...ఇందాకన్నుంచి పిలుస్తున్నాను'' కప్పు చేతికందించి ఎదురుగా కుర్చీలాక్కుని కూర్చుంది సుశీల.

''సుశీలా! ఈ పెళ్ళి ఎలా చెయ్యాలంటావు? వీళ్ళు చూస్తే పెద్దగా ఇవ్వలేమంటున్నారు... సంబంధం మంచిది. ఇంకా తిరిగి సంబంధాలు చూసే శక్తి నాకు లేదు.''

''ఎలాగోలా చేద్దాంలెండి. మీరు కంగారుపడకండి.'' అంది సుశీల. ఇద్దరూ చెరో యాభైవేలూ ఇవ్వొచ్చు. మీరడగలేకపోతే నేనడుగుతాను..'' అంది సుశీల భర్తకు ధైర్యం చెపుతూ..

''వద్దు...సుశీలా...వద్దు. ఇంతిమ్మని వాళ్ళను అడగ వద్దు..రేపటిదాకా టైం ఇచ్చాము కదా చూద్దాం వాళ్ళేం చెబుతారో...'' అంటూ కుర్చీవెనక్కి వాలిపోయి మళ్ళీ తన ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు రామారావు.

• • •

''బాబాయ్'' పిలుపు వినపడ్డంతో ఉలిక్కిపడి


## ఏనుగుతల దేశం

థాయ్‌లాండ్ దేశంలో ఏనుగుల్ని విరివిగా ఉపయోగిస్తారు. అందువలననే ఆదేశపు ఆకారం అచ్చం ఏనుగు తలను పోలి ఉంటుంది. ఈ విషయాన్ని మనం జాగ్రత్తగా ప్రపంచ పటాన్ని పరిశీలించి గ్రహించవచ్చు. కావాలంటే ప్రపంచపటాన్ని పరీక్షించి చూడండి. థాయ్‌లాండ్ భూభాగం పొడవాటి ఏనుగుతొండంలా మలేషియా-సింగపూర్‌ల వైపునకు వ్యాపించి ఉంటుంది. ఏనుగు చెవుల్ని పోలినట్లు కంపూచియా-లావోస్‌లవైపు కనిపిస్తుంది. బర్మావైపు ఏనుగుతల భాగంలా కనిపిస్తుంది. ఈ విషయాలన్నీ మనం ప్రపంచపటాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఏనుగు తలను పోలినట్లుండే థాయ్‌లాండ్ దేశపు భూభాగమైన ఆకారాన్ని మనం స్పష్టంగా గమనించవచ్చు.

## చంద్రుడు దూరమవుతున్నాడు

చంద్రుడు భూమికి నానాటికీ దూరమవుతున్నాడన్న నిజం శాస్త్రవేత్తల దృష్టికి వచ్చింది. భూమి నుండి చంద్రుడు ఏటా 3 సెంటీమీటర్ల చొప్పున దూరంగా జరిగిపోతున్నాడు. సౌరకుటుంబంలో పెద్ద ఉపగ్రహమైన చంద్రుడు ప్రస్తుతం భూమికి మినిమమ్ 3,64,000 కిలోమీటర్ల దూరంలో, గరిష్టంగా 4,06,000 కిలోమీటర్ల దూరంలోను ఉన్నాడు. సూర్యుని నుండి గ్రహించిన కాంతిని భూమి మీదకి వెన్నెలగా విరజిమ్మే చంద్రుడు మనకు దూరమయిపోయినప్పుడు మన పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించి చూడండి మరి.

- శ్రీకొండ




లేచాడు రామారావు. ఎదురుగా గిరిజ.

''ఏంటమ్మా నిద్రపోలేదా!'' కలవరపాటుగా అడిగాడు.

''మీరు నాపెళ్ళికోసం ఇంత హైరానా పడుతుంటే నాకు నిద్రేంపడుతుంది? అయినా నా పెళ్ళికిప్పుడేం తొందరవచ్చిందనీ''

''మీ నాన్న నామీద వుంచిన బాధ్యతమ్మా ఇది. ఆడపిల్ల పెళ్ళి విషయంలో ఎవ్వరైనా ఎదుర్కొనే సమస్యలేనమ్మా ఇవి. నాకొక్కడికే కాదు. అందరికీ వున్నాయి..నువ్వు చిన్నపిల్లవి నీకివేం అర్థంకావు కానీ..నువెళ్ళి పడుకో'' గిరిజను పంపించేశాడు.

తనకిప్పుడే పెళ్ళి వద్దని ఏవేవో చెప్పాలనుకుని వచ్చింది గిరిజ. కానీ బాబాయిదగ్గర మాట్లాడకలేపోయింది. పోనీ పిన్నితోచెపుదామన్నా ఆవిడ వినడమే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితిల్లో అటు వాళ్ళని ఒప్పించలేక, ఇటు పెళ్ళికాదనలేక గిరిజ పడే బాధ ఒక్క భగవంతుడికే తెలుసు. భగవంతుడు కూడా ఒక్కసారి మధ్యతరగతి మానవుడిగా పుట్టివుంటే ఇటువంటి సమస్యలకు పరిష్కారం చూపించేవాడేమో.

రాత్రంతా ఆలోచిస్తూ రామారావు అలాగే కుర్చీలోనే నిద్రపోయాడు. కానీ రవి, సాయి గదుల్లోమాత్రం రాత్రి తెల్లవార్లూ లైట్లు వెలుగుతూనే వున్నాయి.

• • •

''బాబాయ్ మీరు చెప్పిన విషయం గుర్చి రాత్రి బాగా ఆలోచించాము. ఎంత ఆలోచించినా మాకు అంతకుమించి సర్దుబాటు చేసే పరిస్థితి కనిపించడం లేదు. మీరు మరీ కాదంటే.... ఇంకో అదువేలు...''

''మిమ్మల్నే ముష్టి అడగడం లేదురా..ఆయన..మీ చెల్లెలు పెళ్ళికోసం ఆయనెంత ఆరాటపడుతున్నారో గమనిస్తే మీరిలా మాట్లాడరురా'' మండిపడింది సుశీల.

'' రమణైతే అదీ ఇవ్వడం లేదు. రెండోవాడు ఐదువేలే ఇస్తానంటున్నాడు. నేనుమాత్రం పదిహేను వేలు ఇస్తానంటున్నా. ఇంకా ఎంతివ్వాలి? వాళ్ళిద్దరికన్నా నేనెందుకు ఎక్కువియ్యాలి? వాళ్ళూ కొడుకులేగా? వాళ్ళనూ ఇమ్మనండి. వాళ్ళంతిస్తే నేనూ అంతిస్తాను.'' అని పెళ్ళాం వేపు చూసాడు. ఎలా అడిగానో చూశావా? అన్నట్లుగా.

''బాగుందిరా నువ్వు చెప్పేది. నీకోరకం చదువు అబ్బింది, వాడికి ఇంకోరకం అబ్బింది. అందరూ ఒకటే చదువుకున్నారా? ఇదీ అంతేరా..గాయమైన వేలికి కట్టుకట్టి జాగ్రత్తగా చూసుకుంటాము గానీ, మన చెయ్యేకదాని మిగతా వేళ్ళకు కూడా కట్టుకట్టలేమురా..'' అన్నాడు రామారావు.

''అత్తయ్యా...మేము మా మాకష్టార్జితంతో, మా పుట్టింటి వారి సహాయంతో ఇల్లు కట్టుకుంటున్నాం.. అయినా మాకు వీలెంది చేస్తామంటున్నాం...ఇందులో తప్పేంవుంది?'' అంది రెండోకోడలు.

''మీ తప్పేం లేదమ్మా...మీరు అడిగినప్పుడల్లా తను వాళ్ళనాన్నకు నచ్చచెప్పి మీకు డబ్బులిప్పించిందే గిరిజ... దానిదమ్మా తప్పు. మీకుమల్లే అది కూడా జాగర్తపడివుంటే ఈనాడిన్ని అవస్థలు లేకుండా వుండేవి''

''పిన్నీ! మానాన్న మాకేదో చేసాడని పదేపదే అనక్కర్లేదు. కన్నతండ్రిగా అది ఆయన బాధ్యత..మాకూ మేం చేతనయినది చేస్తామంటున్నాంగా...''

''వద్దురా మీరెవరూ ఏం చేయెద్దు నేను చేస్తానురా గిరిజ పెళ్ళి.....మీ నాన్నపోయినా నేను బతికేవున్నానురా...నేనుండగా దానికేలోటు రానియ్యను..మీరందరూ దానిపెళ్ళికొచ్చి, నాలుగు అక్షింతలు వేసిపొండిరా చాలు'' ఉక్రోషంతో అన్నాడు రామారావు.

''పదండి..ఇంకెందుకు ఇక్కడ? డబ్బులేం చెట్లకు కాయడం లేదు..'' అంటూ కోడళ్లు కొడుకుల్ని ఇదే అదనుగా భావించి గదుల్లోకి తీసుకుపోయారు.

నిశ్చేష్టులైపోయారు సుశీలా, రామారావు.

• • •

రామారావు తను రిటైరవగా వచ్చిన సొమ్ముకు, తన ఇల్లు కూడా తాకట్టుపెట్టి గిరిజ పెళ్ళి ఉన్నంతలో వైభవంగా జరిపించాడు. తన అన్న కూతురు పెళ్ళి కోసమని కూడబెట్టిన డబ్బు అలా బాంకులోనే వుండిపోయింది. పెళ్ళికి వచ్చిన బంధువులందరికీ అదంతా వాళ్ళనాన్ననుంచి తమ బాబాయి కాజేసి డబ్బుని ఈవిధంగా నల్గురిలో తనే ఈ పెళ్ళి జరిపించినట్టు నాటకం ఆడుతున్నాడని... తమతప్పుకప్పిపుచ్చుకోడానికి రామారావుపై నిందారోపణ చేశారు.

వాళ్ళు చేస్తున్న ఆరోపణలు ఆనోటా ఈనోటా సుశీల చెవుల్లో పడినప్పటికీ, వాళ్ళకూ తనభర్తకు ఇంకా విరోధాలు తెచ్చినదానినవుతానని ఈ విషయం రామారావుతో చెప్పలేక తనలోనే దాచుకుంది.

తమ సర్వస్వం ధారపోసినప్పటికీ ఎవరికీ మంచివాళ్ళం కాలేకపోతున్నామే, తన భర్తకు తగిన గుర్తింపు లేకపోతేందే అన్న మానసిక క్షోభ ఆమెను కృంగదీయసాగింది. తనకు కన్నతండ్రీ లేకపోయినా అన్నీ తామై పెంచిపోషించి, పెళ్ళిచేసిన తన బాబాయ్ పిన్నిలంటే గిరిజకు అభిమానముండి ఎన్నోసార్లు చూడడానికి వచ్చి తనింటికి వచ్చి వుండమని అడిగినప్పటికీ, ఆడపిల్ల ఇంటిలో వుండడానికి వాళ్ళకు మనసొప్పేది కాదు.

''నీకు మేము చేయాలిగానీ, నీచేత చేయించుకోవడమేంటమ్మా..మాకంతగా సాగనప్పుడు నీయింటికే వస్తాంలెమ్మని'' ఆమెని ఏదోలా సమాధాన పరిచి పంపే

సేవారు.

రామారావుచిన్న పార్టుటైం ఉద్యోగం చూసుకుని చేస్తున్నాడు. తనకి కాలక్షేపం అయిపోతోంది. కానీ సుశీల పరిస్థితే అధ్వాన్నంగా తయారయింది. గిరిజ పెళ్ళితో ఉన్న డబ్బంతా ఖర్చయిపోవడం తమనెక్కడ పోషించవలసి వస్తుందోనని తన అన్నగారి కుమారులు తలో దిక్కుకు వెళ్ళిపోయారు. వాళ్ళని తలచుకుంటూ మనోవ్యధతో కృంగిపోతూ మంచాన పడింది సుశీల.

ఆమె వైద్యానికై శక్తికి మించి ఖర్చు చేస్తున్నాడు రామారావు. అయినా మనోవ్యాధికి మందులేదన్నట్టుగా ఆమె పరిస్థితి ఏమాత్రం నయం కావడం లేదు... పిల్లలందరితో కలిసివుండాలని సుశీల కోరిక. అది నెరవేరుతుందా...అక్కడికీ రామారావువెళ్ళి వారిని అడిగి చూసాడు. వాళ్ళు వస్తామన్నారుగానీ..రాలేదు సరి కదా..ముగ్గురూ తలో ఐదువందలు డబ్బులు మాత్రం పంపించారు... చూడడానికి వస్తే ఇంకెంత అడుగుతారనో వాళ్ళ భయం.

స్వార్ధపరులెప్పుడూ మనుషుల అప్యాయతలను, అనురాగాలను డబ్బుతోనే కొలుస్తుంటారు.

తనకు వాళ్ళ సహాయం అక్కర్లేదనుకున్నాడు. ఉన్న ఇంటిని అమ్మగా వచ్చిన డబ్బులో, ఇంటి అప్పుపోను మిగిలిన డబ్బుతో భార్యకు వైద్యం చేయించసాగాడు.

రోజులు గడుస్తున్నాయి. సుశీల ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుంటోంది. తన సుశీలకు వైద్యం చేయించగలనా? ఇంకా మంచి వైద్యం చేయిస్తే త్వరగా కోలుకునేదేమో! ఇంతబతుకు బతికి చివరికి తన భార్యకు సరిగా వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడిందే...తనూ చేసిన పనికి తన భార్య శిక్ష అనుభవిస్తోంది..

సమాజం మీద కసి...పగ..పెరిగిపోతున్నాయి..కానీ ఏమీ చేయలేని పరిస్థితిలో...ఒక స్నేహితునితో సలహా మేరకు మిగిలిన డబ్బును ఈ శరణాలయానికి కట్టి ఇక్కడకు వచ్చి చేరాడు. ఇక్కడైతే సుశీలకు వైద్యంతోపాటు తమకు ఇంత నీడ దొరుకుతుందని......'' గతంగుర్తుకొచ్చిన రామారావు కళ్ళవెంట అప్రయత్నంగానే నీళ్ళు ధారగా కారుతున్నాయి...

'' మీకోసం ఎవరో వచ్చారు...'' అన్న పిలుపుతో ఈలోకంలోకి వచ్చిన రామారావు బయటకు వచ్చి ఎదురుగా వున్న కొడుకులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్ళని చూసి ఆశ్చర్యపోయాడు. తనకింతమంది బంధువులున్నారా? వీళ్ళంతా ఎవరూ? తన సుశీల బాధతో అల్లాడుతున్నప్పుడు వీళ్ళంతా వచ్చి చూసిన వాళ్ళు కూడా కాదే! మరి ఇప్పుడెందుకొచ్చినట్టో... ఆలోచించుకుంటుండగా..

''బాబయ్యా....మావయ్యగారు'' అంటూ అప్యాయతల్ని ఒలకబోస్తూ పిలుస్తున్నారు.

''మీరు ఏమయిపోయారోనని ఎంత ఖంగారుపడిపోయామో...పిన్ని ఎక్కడవుంది? కులాసాగావుందా? పిన్నీ...పిన్నీ'' అంటూ వాళ్ళు కురిపిస్తున్న అనురాగం పట్ల రామారావుకు ఏవగింపుకలుగుతోంది.

కానీ సుశీల మొఖంలో మాత్రం పున్నమిచంద్రుని కాంతి కనబడుతోంది. ఈమధ్యకాలంలో సుశీల ముఖంలో ఇంత ఆనందం కన్పించలేదు. పాపం పిచ్చిది వాళ్ళు కురిపించే అప్యాయత అంతా నిజమేననుకుంటోంది. పెంచిన మమకారం అటువంటిది. మొత్తానికి వాళ్ళందరి బలవంతం మీద తిరిగి పెద్దకొడుకు ఇంటికి వెళ్ళక తప్పలేదు రామారావుకు. ఈవిధంగానైనా సుశీల ఆరోగ్యం కుదుటపడుతుందనుకుని మనసును చంపుకుని వెళ్ళాడు.

కొత్తచోటు అవటం మూలాన ఆరోజు రాత్రి రామారావుకు నిద్రపట్టలేదు. సుశీలమాత్రం నిశ్చింతగా ప్రశాంతంగా నిద్రపోతోంది. నిద్రకుపక్రమించబోతున్న రామారావుకు పక్కగదిలో వాదన విన్పించే సరికి గుమ్మం బయటకు వచ్చాడు.

''నేను చెప్పేది వినరా...బాబాయ్య, పిన్ని మాఇంట్లో వుంటేగానీ వాళ్ళ పేరున పెట్టిన పి.ఎఫ్.రాదు..దానితో మా అమ్మాయి పెళ్ళి చెయ్యొచ్చని నేను వేసుకున్న ప్లాను చెడగొట్టద్దురా తమ్ముడూ..''

''నా పరిస్థితి కూడా అర్ధం చేసుకో అన్నయ్యా...కొత్త ఇల్లు కట్టుకుందుకు లోను కావాలంటే ఇంట్లో ఎవ్వరైనా పెద్దవాళ్ళుంటే లోను తొందరగా ఇస్తారని కదా..వాళ్ళని తిరిగి తీసుకువచ్చిందీ...''

''మీ సమస్యలు సరేరా! నా ఉద్యోగం..బాబాయి వాళ్ళ స్నేహితుని రికమండేషన్ వల్ల వచ్చింది..ఆయన వాళ్ళను అడుగుతున్నాడురా...ఆయనకేం చెప్పను..''

''ఉష్..గట్టిగా అరవకండీ...అది వాళ్ళ చెవిన పడిందంటే...వాళ్ళు మళ్ళీ ఎక్కడికైనా వెళ్ళిపోతారు...'' అంటోంది ఒక కోడలు హెచ్చరింపుగా.

''ఎక్కడికి వెళ్తారు? ఈ ముసలాళ్ళకు నాలుగు చల్లని మాటలు చెప్తేచాలు, అభిమానం, అప్యాయతలంటూ చూరుపట్టుకుని వెళ్ళాడతారు...ఏదో మన అవసరం తీరేదాకా నాల్గురోజులు కలివిడిగా కాలక్షేపం చేసామంటే..తరువాత వాళ్ళ దారేదోవాళ్ళే చూసుకుంటారు'' అంటున్న చిన్నకొడుకు మాటలు విన్న రామారావు తన గదిలోకెళ్ళిపోయాడు.

• • •

ఉదయాన్నే బాబాయికోసం కాఫీకప్పుతో గదిలోకొచ్చిన రమణ చిన్నకేకవేశాడు.

'అన్నయ్యా, వదినా''

ఆ అరుపులకు నిద్రపోతున్నవాళ్ళుకూడా ఉలిక్కిపడి లేచి ఆ గదివైపునకు పరిగెత్తుకొచ్చారు.

ఆ గదిలో వారికి రమణ మాత్రమే కనిపించాడు.

★

## జర్నలిస్ట్ జాకీ



బొంబేకి చెందిన ఓ ప్రముఖ పత్రిక మీరే మాలా విలేకరి అయితే ఏం చేస్తారు అని జాకీష్రాఫ్‌ను అడిగితే, 'ఆత్మహత్య చేసుకుంటాను' అని సమాధానం చెప్పాడు. 'ఒక వ్యక్తి వార్తల్లోకి ఎక్కాలన్నా పత్రికలో అతని పేరు మారుమ్రోగాలన్నా ఏం చేయాలి?' అని అడిగితే 'రేప్ చెయ్యాలి' అని చెప్పాడు జాకీష్రాఫ్.

## మృగయా మిథున్

ప్రముఖ దర్శకుడు మృణాల్‌సేన్ ఫిల్మ్ఇన్‌స్టిట్యూట్‌లో ఓసారి మిథున్ చక్రవర్తిని చూశారు. ఆ తర్వాత మూడేళ్ళకి 'మృగయా' చిత్రం స్క్రిప్ట్ తయారయ్యింది. తనకెమెరామేన్‌ని పిలిచి మూడేళ్ళ క్రితం ఓ కుర్రాడిని చూశాను. ఈ చిత్రంలో అతను హీరోగా సరిపోతాడు. అతని పేరు గుర్తులేదు. బెంగాలీ కుర్రాడు. పేరు 'ఎం'తో ప్రారంభమవుతుంది' అనిచెప్పారు.

- డి.సత్యమూర్తి

